www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 14 | సెప్టెంబర్ | 2026 పేజీలు : 8

## దివ్యాంగులకు దన్నుగా పువ్వాడ ఫౌండేషన్



-మమత ద్వారా మెరుగైన వైద్య సేవలు
-మాజీ మంత్రి పువ్వాడ
-పువ్వాడ నాగేశ్వరరావు జన్మదిన సందర్భంగా కృత్రిమ అవయవాల పంపిణీ

2లో..

# నాడు భూస్వాములు.. నేడు కార్పోరేట్లు..
# ప్రతిఘటించడమే కమ్యూనిస్టుల లక్ష్యం

## కర్నాటి కృష్ణయ్య పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు
తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో బాగం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నాడు నైజాం పాలనలో భూస్వాములు, జమిందార్లు, దేశ్‌ముఖ్‌ల పెత్తనం కొనసాగితే, నేడు కార్పొరేట్ సంస్థలు భూములు, సహజ వనరులు, ప్రభుత్వ రంగ సంస్థలపై ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తున్నాయని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. దోపిడీ రూపాలు మారినా, దోపిడీ స్వభావం మాత్రం కొనసాగుతోందని, కర్నాటి కృష్ణయ్య పోరాట

మిగతా 2లో..

## నిజాం ప్రభుత్వాన్ని కూల్చిన ఘనత కమ్యూనిస్టులదే..
తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో సాబీర్ పాషా



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నాటిదొరలు దేశ్‌ముఖ్‌ల రజాకారుల మూకలను తిరిమికొట్టి తెలంగాణకు విముక్తి కలిగించింది కమ్యూనిస్టులే అని, అదే స్ఫూర్తితో ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న నేటి పాలకులను తరిమికొట్టాల్సిన అవసరం ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా పిలుపునిచ్చారు. ఆదివారం పాల్వంచలోని చంద్ర రాజేశ్వర రావు భవనం ఎదుట అరుణ పతాకాన్ని

మిగతా 2లో..

# సర్వ విఘ్నాపే శాంతయే..

## నేడే వినాయక చవితి

- ఊరూరా సందడే సందడి
- భద్రాచలంలో ప్రత్యేకంగా ఏర్పాట్లు
- పండుగుల సీజన్ షురూ..
- పిఓపి విగ్రహాలతో పొంచి ఉన్న ముప్పు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వక్రతుండాయ బాలచంద్రాయ గౌరి తనయా నమోస్తుతే.. అంటూ సర్వవిఘ్నాలను తొలగించే ఏకదంతున్ని శరన్నవరాత్రులు కొలిచేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. సోమవారం వినాయక చవితి కావడంతో గ్రామాలు పట్టణాలు కాలనీలు అపార్ట్మెంట్లలో గణేషుని మండపడాలు ఏర్పాటు కావడంతో పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారుల నుండి పెద్దల వరకు వినాయక చవితి వేడుకల కోసం ఉత్సాహంగా ఉన్నారు. ఇళ్లలో మట్టి వినాయక విగ్రహాలు ప్రష్ఠించి ప్రత్యేక పూజు నిర్వహించేందుకు ప్రజలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరోవైపు యువత ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భారీ గణేష్ మండపాలను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. మండపాల వద్ద భక్తి కార్యక్రమాలు భజనలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు విద్యాలయాలు ప్రజలు మట్టి విగ్రహాలను ఉచితంగా అందించేందుకు సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉండగా వినాయక మండపాల నిర్వహణ, ఏర్పాట్లు శోభాయాత్ర విమజ్జనాలు విద్యుత్ మైక్ తదితరాలపై పోలీసులు ఆంక్షలు విధించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచిస్తున్నారు.

### మార్కెట్లో సందడి...

వినాయక చవితి సందర్భంగా మార్కెట్లు సందడిగా మారాయి. వినాయక విగ్రహాలు, పూలుపండ్లు కొబ్బరికాయలు పూజాసామాగ్రి అలంకరణ వస్తువులకు డిమాండ్ పెరిగింది. పండుగను పురస్కరించుకుని వ్యాపారులు ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేయడంతో మార్కెట్లో సందడి వాతావరణం

మిగతా 2లో..

# ప్రజా పోరాటాలతోనే
# ప్రజాస్వామ్య పరిరక్షణ

## -ఏచూరి వర్ధంతి సభలో ప్రబీర్ పుర్కాయస్థ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజా పోరాటాలతోనే ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని సీనియర్ జర్నలిస్టు, న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ తెలిపారు. సాంప్రదాయ ఉద్యమాలతో పాటు నవీన సమాజానికి అనుగుణంగా ప్రజా ఉద్యమాలు నిర్మించాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. సిపిఎం జాతీయ మాజీ పూర్వ కార్యదర్శి సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి సందర్భంగా స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో సభను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా భారతదేశ ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సెమినార్ ప్రబీర్ పుర్కాయస్థ మాట్లాడుతూ హక్కులు హరించబడుతున్నాయని ఇప్పుడు హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమనిర్మాణం జరగాల్సి ఉందన్నారు. ఇటీవల కాలంలో జరిగిన విద్యార్థి ఉద్యమాలు భావ వ్యక్తికరణ ఒక కొత్త ఒరవడిని తెరపైకి తీసుకు వచ్చాయన్నారు. సమస్యను అధిగమించడానికి కృషి జరగాలని ఆయన సూచించారు.

మిగతా 2లో..

# నాడు భూస్వాములు.. నేడు కార్పొరేట్లు.. ప్రతిఘటించడమే కమ్యూనిస్టుల లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)
స్ఫూర్తితో నేటి ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల భాగంగా ఆదివారం నేలకొండపల్లిలోని కర్నాటి కృష్ణయ్య స్తూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ.. భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టిచాకిరీ విముక్తి కోసం వేలాది మంది రైతులు, కూలీలు, పేదలు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో వీరోచితంగా పోరాడారని గుర్తుచేశారు. నైజాం నిరంకుశ పాలన, భూస్వాముల దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా కర్నాటి కృష్ణయ్య వంటి యోధులు ప్రజలను చైతన్యపరిచి ఉద్యమంలోకి తీసుకువచ్చారని తెలిపారు. నేలకొండపల్లి మండలానికి చెందిన కర్నాటి కృష్ణయ్య తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించడంతో పాటు, అనంతరం ఖమ్మం తొలి శాసనసభ్యుడిగా ప్రజల సమస్యలను శాసనసభలో బలంగా వినిపించారని హేమంతరావు పేర్కొన్నారు. పేదలు, రైతులు, కార్మికుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన ఆయన ప్రజా సేవ, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమన్నారు. నాడు భూస్వాములు రైతుల భూములు, శ్రమను దోచుకుంటే.. నేడు కార్పొరేట్ శక్తులు వ్యవసాయ భూములు, సహజ వనరులు, ప్రభుత్వ రంగ సంస్థలను తమ ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని హేమంతరావు విమర్శించారు. ప్రజల సంపదను కొద్దిమంది చేతుల్లో కేంద్రీకరించే విధానాలను ప్రతిఘటించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను భావితరాలకు తెలియజేయాలని, కర్నాటి కృష్ణయ్య వంటి పోరాట యోధుల ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. రైతులు, కార్మికులు, కూలీలు, యువత, పేదల హక్కుల పరిరక్షణకు



ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. నాడు నైజాం నిరంకుశత్వంపై సాగిన పోరాట స్ఫూర్తితో.. నేడు కార్పొరేట్ ఆధిపత్యం, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా పోరాటాలను బలోపేతం చేయడమే కర్నాటి కృష్ణయ్యకు నిజమైన నివాళి అని బాగం హేమంతరావు అన్నారు. అనంతరం పార్టీ అరుణ పతాకాన్ని జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహమ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భానుప్రసాద్, యర్ర బాబు, తోట రామాంజనేయులు, తాటి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్తియ శ్రీనివాసరావు, మండల కౌన్సిల్ సభ్యులు కాశబోయిన అయోధ్య, పాలపాటి అశోక్, చావ గణపతి, బాలిన కృష్ణంరాజు, ఎస్.కె. సలాం, కనకబండి రామయ్య, చిర్ర ప్రసాద్, తేజావత్ రూప్లా, పొలంపల్లి నారాయణ, పాలకూర్తి తిరుపతి రావు, బాలేబోయిన వెంకటేశ్వర్లు, ఆలేటి ఉమామహేష్, రావెళ్ల కృష్ణ, మూడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)



ఆవిష్కరించారు. అనంతరం జరిగిన వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయిధ పోరాటంలో భారత కమ్యూనిస్టు పార్టీ పాత్ర ఎంతో ఉందని, భూమి భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అరాచక పాలనను అంతమొందించడంలో సిపిఐ కీలకపాత్ర పోషించిందన్నారు. రావి నారాయణరెడ్డి బద్దం ఎల్లారెడ్డి ముఖ్దుం మొహీయుద్దీన్ పిలుపుతో పోరాటం ప్రారంభమైందన్నారు. ఈ మహత్తర పోరాటం నిజాం స్వాదీనంలో ఉన్న తెలంగాణను భారతదేశంలో అంతర్భాగం చేసిందన్నారు. ఇదే ప్రమాదకర పరిస్థితులు ప్రస్తుతం దేశంలో నెలకొన్నాయని, తెలంగాణ సాయుధ పోరాటంలో ఇసుక రేణువంతైనా బిజేపి పాత్ర లేదన్నారు. ఈ పోరాటాన్ని తామే చేసినట్లు చెప్పుకోవడం ఉత్సవాలకు సిద్ధం కావడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమైనా విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరారు. అనంతరం ఈ సేవ సెంటర్ వద్ద సాయుధ పోరాట యోధులు ఉషారాణి రామకోటయ్యల స్థూపం, సిద్ధి వెంకటేశ్వర్లు ఉప్పుశెట్టి ఖాదర్ బాబు దేవభక్తుని రమేష్ చంద్రశేఖర్ పాశం శ్రీనివాస్ స్మారక స్థూపాల వద్ద పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్యాల విశ్వనాథం, మేయర్ మూడ్ గణేష్ జిల్లా కార్యవర్గ సభ్యులు అదుసుమిల్లి సాయిబాబా, వీశంశెట్టి పూర్ణచంద్ర రావు, ఉప్పుశెట్టి రాహుల్ తో పాటు వీశంశెట్టి విశ్వేశ్వరరావు గుర్రం వెంకటేశ్వర్లు జిల్లా సమితి సభ్యులు తదితర్లు పాల్గొన్నారు.

# సర్వ విఘ్నాపే శాంతయే..

(మొదటిపేజీ తరువాయి)
నెలకొంది. వివిధ ఆకృతులు పరిమాణాల్లో తయారు చేసిన వినాయక విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి.

**పర్యావరణపై అవగాహన పెరుగుతోంది :** పర్యావరణ పరిరక్షణపై ప్రజలు పెద్ద ఎత్తున అవగాహన పెరుగుతుండటంతో పలువురు మట్టి విగ్రహాల వైపు మొగ్గు చూపుతున్నారు. పర్యావరణానికి హానికరం కాకుండా పండుగలు నిర్వహించాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్న నేపథ్యంలో ప్రజల్లో మార్పు చోటుచేసుకుంటోంది. నిమజ్జన సమయంలో నీరు కలుషితం కాకుండా జలచారాల ప్రాణాలకు నష్టం వాటిల్లకుండా పర్యావరణ హితంగా నిర్వహించేందుకు గణేష్ ఉత్సవ కమిటీలు కూడా చర్యలు తీసుకుంటున్నాయి.

**ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో ప్రమాదం :** ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలతో పెను ప్రమాదం పొంచి ఉంది. నీటి కాలుష్యమే కాకుండా జల చరాల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. పర్యావరణం పెద్ద ఎత్తున కాలుష్యం కానుంది. చాలా చోట్ల వినాయక మండపాల్లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్, రంగులతో తయారైన విగ్రహాలను పూజించేందుకు సైతం ఏర్పాట్లు జరుగుతున్నాయి. మార్కెట్లో పెద్దఎత్తున ఇలాంటి విగ్రహాల అమ్మకాలు సాగుతున్నాయి. పర్యావరణపై మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉంది.

**పండుగల సందడి షురూ :** వినాయక చవితితో పండుగల సందడి ప్రారంభం కానుంది. సర్వవిఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరున్ని పూజించి అంతా సవ్యంగా ఉండాలని నవరాత్రుల పాటు ధ్యానిస్తారు. వినాయక చవితి తర్వాత దసరా, దీపావళితో పాటు తదితర ప్రధాన పండుగల సీజన్ ప్రారంభం కానుండటంతో వస్త్ర దుకాణాలతో పాటు మిఠాయి, పూల మార్కెట్లు అలంకర వస్తువుల వ్యాపారాలు ఊపందుకోనున్నాయి. దీంతో వ్యాపార వర్గాల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

**భద్రాచలంలో ప్రత్యేకం :** గణపతి నవరాత్రులు భద్రాచలంలో ప్రతీ ఏటా ప్రత్యేకంగా నిర్వహిస్తుంటారు. ఇది అధ్యాత్మిక ప్రాంతం కావడంతో ఇక్కడ చేసే వేడుకను ప్రాధాన్యత సంతరించుకుంటోంది. పవర్‌బాయ్స్ ఆధ్వర్యంలో సుమారు 20 అడుగుల మట్టి విగ్రహాన్ని సిద్ధం చేశారు. దీనికోసం గత నాలుగు నెలులుగా పనిచేశారు. అదే విధంగా భద్రాద్రికా మహారాజ్ పేరిట ప్రత్యేక మండపంతో పాటు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ సారి భద్రాద్రి గణేష్ పేరిట స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైధానంలో భారీ సెట్టింగ్ వేశారు. దీంతో పాటు జిల్లా వ్యాప్తంగా భారీ మండపాలు వెలిశాయి.

**ఇది సామాజిక వేడుకగా :** వినాయక చవితి కేవలం ఆధ్యాత్మిక వేడుకగానే కాకుండా ప్రజలను ఒక్కటోటికి చేర్చే సామాజిక పండుగగా కూడా పిలుస్తారు. మండపాల నిర్వహణలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములై గణేష్ నవరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటారు. అంతే కాకుండా అన్నదానాలు విద్యార్థులకు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రమాళికలు సిద్ధం చేస్తున్నారు. దీంతో గణేష మండపాలు భక్తి సామాజిక సేవలకు వేదికలుగా మారుతున్నాయి.

## దివ్యాంగులకు దన్నుగా పువ్వాడ ఫౌండేషన్




**ప్రజాపక్షం/ ఖమ్మం :** దివ్యాంగులకు పువ్వాడ ఫౌండేషన్ అండగా ఉంటుందని ఇప్పటి వరకు 1,140 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలను అందజేసినట్లు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు 89వ జన్మదిన సందర్భంగా ఆదివారం స్థానిక రోటరీ క్లబ్ నేతృత్వంలో పువ్వాడ ఫౌండేషన్ ద్వారా 88 మందికి కృత్రిమ అవయవాలను అందజేశారు. ఇందు కొరకు ట్రస్ట్ ద్వారా రూ. 3,52,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అజయ్ కుమార్ మాట్లాడుతూ కమ్యూనిస్టు నాయకునిగా ప్రజల పక్షాన పువ్వాడ నాగేశ్వరరావు పని చేశారని ఆయన పోరాటం ఎంతో స్ఫూర్తిదా యకమన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగానే విద్య, వైద్యం, సామాజిక రంగాల్లో తమ కుటుంబం సేవలు అందిస్తుందన్నారు. 1996లో నెలకొల్పిన మమత ఆసుపత్రి ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని నాటి నుంచి నేటి వరకు లక్షలాది మందికి వైద్య సాయం అందించడం జరిగిందన్నారు. దివ్యాంగుల కదలికకు, ఆత్మ విశ్వాసానికి తోడ్పాడుతున్న రోటరీ క్లబ్ సభ్యులను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ శాసనసభ, శాసన మండలి సభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు, రోటరీ క్లబ్ బాధ్యులు మల్లాది వాసుదేవ్, పాపారావు, దొడ్డపునేని సాంబశివరావు, పసుమర్తి రంగారావు, జగన్నాథం, వల్లభనేని రామారావు, ప్రసాద్, రామకృష్ణ, బిఆర్ఎస్ నాయకులు ఆర్‌జెసి కృష్ణ, పగడాల నాగరాజు, బత్తుల మురళీ పాల్గొన్నారు. పువ్వాడ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి ఆయనను ఘనంగా సన్మానించారు.

# ప్రజా పోరాటాలతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

(మొదటిపేజీ తరువాయి)
ఉద్యమాలకు అనుగుణంగా కళలు పుట్టుకొచ్చాయని వాటిని ప్రజా చైతన్యానికి వినియోగించాలన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని పారదర్శకంగా అమలు చేయాలని కమ్యూనిస్టులు డిమాండ్ చేస్తున్నారన్నారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వం కొందరి కోసం పనిచేయడం దురదృష్టకరమన్నారు. భారతదేశ ప్రజాస్వామ్యం కొత్త సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరు



ణంలో ప్రజా ఉద్యమ నిర్మాణం జరగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఎం నాయకులు పోతినేని సుదర్శన్, పొన్నం వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, మాస్‌లైన్ నాయకులు సివై పుల్లయ్య, ఎన్డి నాయకులు ఆవునూరి మధు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బుగ్గవీటి సరళ, సోమయ్య, భారతి, హిమబిందు, ఆనందాచారి, బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు, విక్రం తదితరులు పాల్గొన్నారు.

## ట్రస్మా జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా రవికుమార్, కృష్ణ



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం ట్రస్మ జిల్లా అధ్యక్షులుగా భద్రాచలం శ్రీ కోమల హైస్కూల్ కరస్పాండెంట్ పలివెల రవికుమార్, పాల్వంచ లిటిల్‌ఫ్లవర్స్ హైస్కూల్ కరస్పాడెంట్ మాగులూరి కృష్ణ ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రైస్ గ్రాండ్ బాంకెట్ హాల్ లో జరిగిన జిల్లా జనరల్ బాడీ సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక చోటు చేసుకుంది. అధ్యక్ష కార్యదర్శులతో పాటు కోషాధికారిగా ఇల్లెందు మాస్టర్ మైడ్స్ స్కూల్ కరస్పాండెంట్ జక్కుల సర్వేశ్వరరావు ఎన్నికైన వారిలో ఉన్నారు. ఈ ఎన్నికలో భద్రాచలం, పాల్వంచ కొత్తగూడెం మణుగూరు, ఇల్లెందు అశ్వారావుపేట ట్రస్మ డివిజన్ల నుండి కరస్పాండెంట్లు హాజరయ్యారు.

# రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

## సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగం



**ప్రజాపక్షం/ముదిగొండ:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ముదిగొండ మండలం గోకినేపల్లిలో తెలంగాణ సాయుధ పోరాట యోధులు మచ్చ వీరయ్య, ఎర్రమనేని వెంకటనర్సయ్య స్తూపాలకు సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేశ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీపీఐ రాష్ట్ర నియంత్రణ కమిషన్ ఛైర్మన్ మౌలానా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి మాట్లాడుతూ.. దొరలు, భూస్వాములు దోపిడీకి వ్యతిరేకంగా భూమి, భుక్తి విముక్తి కోసం తెలంగాణ రైతాంగం సాగించిన పోరాటం దేశ చరిత్రలో మహత్తర ప్రజా ఉద్యమంగా నిలిచి, ప్రజల హక్కుల కోసం ప్రాణత్యాగాలు చేసిన పోరాట యోధుల త్యాగాలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. రైతాంగ సాయుధ పోరాట యోధుల త్యాగాల స్ఫూర్తితో రైతులు, కార్మికులు, పేదలు, బడుగు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణకు ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, తాటి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు లింగయ్య, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ఎర్రమనేని వెంకటనర్సయ్య కుమారుడు ఎర్రమనేని గంగాధర్, వార్డు సభ్యులు ఇరుకు శ్రీకాంత్, చిన్నబాబు, గంగాధర్‌బాబు, సీపీఐ మండల కార్యదర్శి రావులపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# చేపలు ఉన్న చెరువులో నిమజ్జనం తగదు

## -తీవ్రంగా నష్టపోతున్నాం : మత్స్యకారులు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** చేపల పెంపకం జరుగుతున్న చెరువుల్లో వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగితే నీరు కలుషితమై చేపలు మరణించి తీవ్రంగా నష్టపోతామని మత్స్యకారులు తెలిపారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని ధంసలాపురం చెరువులో వినాయక నిమజ్జనాలు చేయరాదని కొత్తగూడెం మత్స్యకార సొసైటీ సభ్యులు పగడాల మల్లేష్, ముద్రబోయిన అప్పారావు లు తెలిపారు. చేపల పెంపకానికి ప్రభుత్వానికి పన్ను చెల్లిస్తున్నామని ఈ చెరువుపై ఆధారపడి 80 కుటుంబాలు జీవిస్తున్నాయని వారు తెలిపారు. గతంలో ఖమ్మం నగరంలో కలుషిత నీరు రావడంతో టన్నుల కొద్ది చేపలు చనిపోయాయని వారు తెలిపారు. గుర్రపుడెక్క పెరిగి చేపలు పట్టే పరిస్థితి లేదని ఇప్పుడు వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగితే నీళ్ల విషపూరితమై చేపలు మరణిస్తాయని మల్లేష్, అప్పారావు లు తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగం తగు చర్యలు తీసుకుని నిమజ్జనాన్ని ధంసలాపురం చెరువులో జరగకుండా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రకటన చేసిన వారిలో సొసైటీ సభ్యులు పగడాల శ్రీను, వెంకటేశ్వర్లు, శేషయ్య, నాగేశ్వరరావు, రాంబాబు, శ్రీను, వెంకన్న, రాము, పగడాల వెంకటేశ్వర్లు, బాబు లు ఉన్నారు.

# ప్రభుత్వం హామీలను అమలు చేయాలి

## -పెరుగుతున్న విద్యుత్ కోతలు
## -మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి రంగారావు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. హామీల అమలుకై ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడిందని ఆయన తెలిపారు. మాస్‌లైన్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జి.రామయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రంగారావు మాట్లాడుతూ హామీల అమలు పట్ల ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొందని రెండున్నర ఏళ్లు గడిచినా హామీలు అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో వర్షాకాలంలోనే విద్యుత్ కోతలు పెరుగుతున్నాయని రానున్న కాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉండే అవకాశం ఉందని విద్యుత్ కోతలను నివారించేందుకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రైవేట్‌లో ఫీజుల నియంత్రణ లేకపోవడంతో ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆయన తెలిపారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా పంటలను కాపాడే ప్రయత్నం చేయాలన్నారు. సత్వరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నిధులను కేటాయించాలన్నారు. విద్యుత్ కోతలపై ఆందోళన నిర్వహించాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. 22ఎ రైతాంగానికి ఇబ్బందిగా మారిందని దీనిపై ప్రభుత్వం ప్రభుత్వం పునరాలోచన చేసి 22ఎ జీవోను రద్దు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య, నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్, బందెల వెంకయ్య, శివలింగం, శిరోమణి, లలిత పాల్గొన్నారు.

# అరసం రామయ్యకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** అభ్యుదయ రచయితల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు కొంపెల్లి రామయ్యను తెలంగాణ అమరవీరుల ట్రస్ట్, తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అభ్యుదయ రచయితల సంఘం తెలంగాణ అమర వీరుల స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో 'భావన' కవిత సంకలనాన్ని సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా ఆవిష్కరించారు. భావన కవిత సంకలనంలో కొంపెల్లి రామయ్య రచించిన జీవన సమరం అనే కవిత ముద్రితమైంది. పుస్తకావిష్కరణ సందర్భంగా రామయ్యను సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి మాజీ ఎడిటర్ శ్రీనివాస్, సినీ దర్శకుడు బాబ్జీ, అరసం రాష్ట్ర కార్యదర్శి రాపోలు సుదర్శన్, అమరవీరుల స్మారక ట్రస్టు కార్యదర్శి ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

# మున్నూరుకాపు సంఘం
# సభ్యత్వం నమోదుకు వెబ్‌సైట్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/ ఖమ్మం టౌన్ :** తెలంగాణ మున్నూరు కాపు సంఘం(పటేల్స్) సభ్యతాన్ని తీసుకోవాలని, తద్వారా జనాభా ఎంత ఉందో తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలంగాణ మున్నూరుకాపు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కొండా దేవయ్య పటేల్ పేర్కొన్నారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో తమ కుల జనాభా మొదటి స్థానం నుండి 5వ స్థానానికి పడిపోయిందని, తమ జనాభాను చూపించడం లేదని అన్నారు. దీని వలన రాజకీయంగా వెనుకబడిపోయామని, ఉద్యోగ ఉపాధి అవకాశాలు తగ్గాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం వస్తే తమకు న్యాయం జరుగుతుందని భావించామని, కాని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని అన్నారు. నేటి ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తుందని విమర్శించారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా సంఘం వెబ్సైట్ ద్వారా సభ్యత్వం తీసుకోవాలని కోరారు. మున్నూరుకాపులలో 8కులాలను చేర్చాలని కొంతమంది ప్రయత్నిస్తే దానిని అడ్డుకున్నామన్నారు. ప్రతిఒక్కరూ సభ్యత్వం తీసుకోకపోతే తమ కుల జనాభా ఐదు నుండి 10వస్థానానికి పడిపోయే ప్రమాదం ఉందని అన్నారు. ఈ వెబ్సైట్ ద్వారా తాము తిరస్కరించిన 8కులాల వారు సభ్యత్వం తీసుకుంటే గ్రామ, మండల కమిటీల ద్వారా విచారణ జరిపించి అవసరమైతే తీసివేస్తామన్నారు. ప్రభుత్వం మున్నూరు కాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి ప్రకటించిందే తప్పా నిధులు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్‌కు వెయ్యి కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం వైబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శెట్టి రంగారావు, నాయకులు రాపర్తి శరత్, మాటేటి రవికుమార్ పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాట వీరులకు ఘన నివాళి



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సిపిఐ అశ్వారావుపేట మండల సమితి ఆధ్వర్యంలో ఆదివారం సిపిఐ నియోజకవర్గ కార్యాలయం రజబ్ అలీ భవన్‌వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల త్యాగాలను సాయుధ పోరాట అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులర్పించారు. సిపిఐ అశ్వారావుపేట నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సయ్యద్ సలీం మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం భూస్వామ్య దోపిడి, వెట్టి చాకిరి, నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన చారిత్రాత్మక ప్రజా ఉద్యమమని పేర్కొన్నారు. పేద రైతులు, కూలీలు, మహిళలు, గిరిజనులు, అణగారిన వర్గాలు ఎదుర్కొన్న దోపిడి, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో కూడా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల భూ హక్కుల కోసం సిపిఐ నిరంతరం పోరాడిందని సయ్యద్ సలీం తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమాలు కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర, వ్యవసాయ కార్మికులకు ఉపాధి, పేదలకు ఇళ్ల స్థలాలు, భూమి లేని వారికి భూమి, కార్మికులకు కనీస వేతనాలు, యువతకు ఉపాధి వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలను ఐక్యం చేసి పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అమరవీరుల త్యాగాలను కేవలం జ్ఞాపకం చేసకోవడం మాత్రమే కాకుండా, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని అన్నారు. దోపిడి అసమానతలు లేని సమాజం కోసం ఐక్యం పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు గన్నిన రామకృష్ణ, మండల కార్యదర్శి వగ్గెల అర్జునరావు, చీపుర్ల సత్యవతి, శ్రావణి, సజ్జ శ్రీను, చెన్నారావు, వాసు, వెంకన్న, విష్ణు, రాధ, పురుషోత్తం, ప్రసాద్,బాషా, మహాలక్ష్మి , నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# తలసేమియా చిన్నారులకు ఉచిత వైద్య పరీక్షలు





**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మంలోని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సంకల్ప డే కేర్ సెంటర్‌లో తలసేమియా చిన్నారులకు ఆదివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ హేమటాలజిస్టు వైద్యులు వెంకట రమణ తన వైద్య బృందంతో కలిసి వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షలకు అనుగుణంగా బాధితులకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు వెంకటరమణ మాట్లాడుతూ సంస్థ ప్రతినిధుల సలహాలు పాటిస్తూ చిన్నారులకు క్రమం తప్పకుండా మందులు వినియోగించాలని సూచించారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. హిమోగ్లోబిన్ శాతం ఎనిమిది కంటే తగ్గకుండా జాగ్రత్త వహించాలని ఆయన తెలిపారు. హిమోగ్లోబిన్ తగ్గితే అలసటకు గురై ఇతర అవయవాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆయన తెలిపారు. చిన్నారులకు సకాలంలో రక్తం ఎక్కించడంతో పాటు మందులు కూడా క్రమపద్ధతిలో వాడాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో కిన్నెర మెమోరియల్ ట్రస్టు బాధ్యులు కంఠమనేని రాజగోపాల్, వైద్యులు సోహితరెడ్డి, రుచిత, శరత్, రేడియాలజిస్టు నాగేశ్వరరావు, నారాయణమూర్తి, సంకల్ప సంస్థ బాధ్యులు పి. రవిచందర్, అనిత, పావని పాల్గొన్నారు.

# గోగుల వెంకన్న మృతికి
# మాజీ ఎమ్మెల్యే చంద్రావతి సంతాపం

## వెంకన్నకు నివాళులర్పించిన బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ రెండో వార్డు హనుమాన్ బజార్‌కు చెందిన గోగుల వెంకన్న అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న వైరా మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి , బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు ఆదివారం వార్డు కౌన్సిలర్ తిరుపతి శివకుమారి శ్రీణుతో కలిసి గోగుల వెంకన్న నివాసానికి వెళ్లి వెంకన్న పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. నివాళి అర్పించిన వారిలో దేవళ్ల శ్రీను, పల్లపు రాంబాబు, బత్తుల ఉపేందర్, బండారు హనుమంతరావు, వేముల శివకుమార్, వేముల వెంకటేశ్వర్లు, ఓర్సు నారాయణ, బత్తుల కొండలు, ఓర్సు బాలకృష్ణ, బత్తుల వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** సీతాగూడెం పంచాయితీ పరిధిలో ఆదివారం రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ చేపట్టారు. పంచాయితీ ఆవరణలో సర్పంచ్ పిట్టల రామలక్ష్మయ్య లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ స్మార్ట్ కార్డులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో స్మార్ట్ కార్డులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ కార్డులను పొందాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ మాయల సర్వీస్, సీపీఐ మండల కార్యదర్శి బొర్రా కేశవులు, పంచాయితీ సిబ్బంది, డీలర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాల వద్ద భద్రతా నియమాలు పాటించాలి



**ప్రజాపక్షం/కామేపల్లి:** గణేష్ మండపాల వద్ద భద్రతా నియమాలు తప్పని సరిగా పాటించాలని కామేపల్లి ఎస్ఐ పి శ్రీకాంత్ అన్నారు. ఆదివారం ఆయన ప్రజాపక్షంతో మాట్లాడుతూ భద్రతా నిబంధనలను వివరించారు. మండపాల నిర్వాహకులు ముందుగా ఆన్‌లైన్‌లో మండప వివరాలు నమోదు చేసి పోలీసుల అనుమతి పొందాలని, విద్యుత్ శాఖ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మండపాలు ఏర్పాటు చేయాలని, మండలపాల వద్ద, ఊరేగింపుల్లో డీజేలు వినియోగించరాదని స్పష్టం చేశారు. ప్రతి మండపం వద్ద కనీసం ముగ్గురు వాలంటీర్లు 24గంటలు అందుబాటులో ఉండేలా చూడాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అగ్నిప్రమాదాల నివారణకు ఇసుక బకెట్లు, నీటి వసతి లేదా అగ్ని మాపక పరికరాలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. రాత్రి 10గంటల తర్వాత శబ్ద పరికరాలు వినియోగించరాదని, ఇతరుల మనోభావాలను దెబ్బతీసే లేదా రెచ్చగొట్టే పాటలు, నినాదాలు పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలకు అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఖమ్మం కేంద్రంగా సెప్టెంబర్ 28,29,30తేదీల్లో నిర్వహించనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్)జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఇల్లందు మండలం పోచారం పంచాయితీలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఏఐకేఎంఎస్ ఇల్లందు మండల కార్యదర్శి మూడు మూలు, వీవైఎల్ రాష్ట్ర నాయకుడు మోతిలాల్, మండల నాయకుడు జోగా కృష్ణ, పోచారం కార్యదర్శి తుడుం శ్రీను, ఏఐకేఎంఎస్ అధ్యక్షుడు లచ్చ, మాజీ సర్పంచ్ శ్రీను, కార్యదర్శి, ఉప సర్పంచ్ కోడి పాపయ్య, వార్డు సభ్యుడు లక్ష్మ రూప్లతో పాటు సురేష్, సూర్యం, రాజు, లక్ష్మణ్, రాజులు, దేస్సు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## మృతులకు నివాళి



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోత్ రాంబాబు పలు దశదిన కార్యక్రమాలకు హాజరై మృతుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ శ్రేణు లతో కలిసి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. మాణిక్యారం పంచాయితీ యల్లాపురం తండాకు చెందిన ధారావత్ నాగేష్, కొమరారం పంచాయితీ సొసైటీ వైస్ ఛైర్మన్ పొలెపల్లి నాగేశ్వరరావు తల్లి పొలెపల్లి సత్తెమ్మ దశదిన కార్యక్రమాల్లో పాల్గొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమాల్లో మాణిక్యారం కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చెన్నూరి శ్రీను, ఆత్మ కమిటీ డైరెక్టర్ పుప్పాల ఉపేందర్, మం డల కాంగ్రెస్ కార్యదర్శి చెన్నూరి కృష్ణ, డాక్టర్ బుచ్చి నారాయణ, నెల్లూరి వెంకటేశ్వర్లు, బానోత్ భానుచందర్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## పేకాట, కోడి పందేలపై కఠిన చర్యలు

**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** పేకాట నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో దుమ్ముగూడెం పోలీసులు ఓ స్థావరంపై ఆకస్మిక దాడి చేశారు. పోలీసుల రాకను గమనించిన నిర్వాహకులు, ఆటగాళ్లు పరారయ్యారు. వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పేకాట, కోడిపందేలు నిర్వహించడం పాల్గొనడం, పందేలు కాయడం, స్థలం లేదా ఇతర సౌకర్యాలు కల్పించడం వంటి చర్యలను ఉపేక్షించబోమని పోలీసులు హెచ్చరించారు. గ్రామ శివార్లు, అటవీ ప్రాంతాలు, వ్యవసాయ భూములు, ఇళ్లు తదితర ప్రాంతాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. కోడిపందేల్లో కోళ్లకు కత్తులు కట్టడం, వాటిని హింసించడం, పందేలకు సహకరించడం వంటి చర్యలపైనా కేసులు నమోదు చేసి వాహనాలు, సామగ్రిని స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. ఇటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాల సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారదాతల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# యోధున్ని కన్న పల్లె

### -చరిత్ర పుటల్లో తొండలగోపవరం





అది ఓ కుగ్రామం సరైన రవాణా సౌకర్యాలు లేవు. ఎర్ర బస్సు చూడాలన్న కనీసం ఐదారు కిలో మీటర్లు నడవాలి. వ్యవసాయకంగా అప్పట్లో అంతగా అభివృద్ధి లేదు. కట్టలేరు సమీపంలో ప్రవహిస్తున్న అంతగా నీటి సౌకర్యం ఉండేది కాదు. అటువంటి రోజుల్లో మెట్ట వ్యవసాయమే ప్రధానంగా ఉండేది. ఆ గ్రామంలో మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించిన ఓ వ్యక్తి భారతదేశ వ్యాప్తంగా కీర్తినార్జించి పల్లెకు ఓ నూతన చరిత్రను తీసుకువచ్చారు. ఆ పల్లె ఇప్పటి మధిర మండల పరిధిలోని తొండలగోపవరం. ఆ చరిత్రను సృష్టించిన మహోన్నతుడు నల్లమల గిరిప్రసాద్. ఎగువ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఆయన ఆరోజుల్లోనే ఉన్నత విద్యాభ్యాసం కోసం మద్రాస్ వెళ్లారు. మద్రాస్‌లో చదువుతున్నప్పటికీ తెలంగాణలోని పరిణామాలు ప్రజలు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్నారు. మద్రాస్ నుంచి ఇంటికి సెలవుల నిమిత్తం వచ్చిన ఆయన ఇక తిరిగి చదువు వైపు చూడలేదు. ఇప్పటి కృష్ణాజిల్లా తునికిపాడులో జరుగుతున్న కమ్యూనిస్టు పార్టీ రాజకీయ శిక్షణా తరగతులకు హాజరయ్యారు. గ్రామ రక్షణ దళాల్లో చేరారు. ఏక సంథాగ్రహి కావడం, సమాజం పట్ల అవగాహన ఉండటం అన్నింటికి మించి అంకితభావం ఆయనను శిఖరాగ్రానికి చేరువ చేసింది. కమ్యూనిస్టు పార్టీ పిలుపునందుకుని సాయుధదయ్యాడు. శిక్షణ పొందిన అనంతరం గిరిదళం పేరుతో పాల్వంచ ప్రాంతంలో పనిచేస్తూ రజాకారు మూకల వెన్నులో వణుకుపుట్టించారు. వేల ఎకరాలను పేదలకు పంపిణీ చేస్తూ గ్రామాలను విముక్తి చేస్తూ ముందుకు సాగాడు. గిరిదళం పేరు వింటేనే సైన్యాలు భయపడేవి. ఆయన జీవిత కాలంలో తుపాకీ గుండు మచ్చ తప్ప మరో మచ్చ లేదన్న ప్రచారం అక్షర సత్యం. సాయుధ పోరాటంలో ఆయనపై తుపాకీ కాల్పులు జరిగాయి. తీవ్రంగా గాయపడిన గిరిప్రసాద్‌ను ప్రజలు రక్షించుకున్నారు. కేవలం ఉదయించే సూర్య కిరణాలు ఆకు పసరులే ఆయనను రక్షించాయి. జైలు జీవితాన్ని అనుభవించిన గిరిప్రసాద్ ఉమ్మడి ఖమ్మంజిల్లా కార్యదర్శిగా, కమ్యూనిస్టు పార్టీ విస్తరణలో తనదైన ముద్ర వేశారు. జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ ఉప ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన గిరిప్రసాద్ శాసన సభ్యునిగా, రాజ్యసభ సభ్యునిగా, స్వాతంత్ర్య సమరయోధుల స్క్రీనింగ్ కమిటీ సభ్యులుగా పనిచేశారు. తాను ఏ పదవి చేపట్టినా ఆ పదవికి వన్నె తెచ్చారు. రాజకీయ మేధావిగా, ఆలోచన పరునిగా తనదైన పద్ధతిలో ప్రజా ఉద్యమ నిర్మాతగా గిరిప్రసాద్ కీర్తి గడించారు. ఆ మహనీయుని కన్న పల్లె తొండలగోపవరంకు చరిత్రలో స్థానం దక్కింది. చరిత్ర ఉన్నంత కాలం గిరిప్రసాద్‌తో పాటు ఆయన జన్మించిన తొండలగోపవరం గ్రామం కూడా సజీవమే.

-ప్రజాపక్షం/మధిర

# సాయుధ పోరాట త్యాగాలు చిరస్మరణీయం

**- చరిత్రను వక్రీకరించే కుట్రలను తిప్పికొడదాం**
**- సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు సలిగంటి**



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** వీరోచిత తెలంగాణ సాయుధ పోరాట త్యాగాలు చిరస్మరణీయమని కమ్యూనిస్టుల రక్తతర్పణంతో నిజాం నిరంకుశ పాలన అంతమైందని సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు సలిగంటి శ్రీనివాస్, కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య అన్నారు. సిపిఐ కొత్తగూడెం పట్టణ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కార్పొరేషన్ పరిధిలోని పాత కొత్తగూడెం సెంటర్లో సాయుధ పోరాట వారోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. తొలూత ఎర్ర జెండా ఎగురవేసి అమరుల స్థూపాల వద్ద నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెట్టిచాకిరీ విముక్తి కోసం భూమి భుక్తి కోసం నాలుగువేల మందికిపైగా అమరులై రక్తధారపోసిన ఘన చరిత్ర కమ్యూనిస్టులదని స్పష్టం చేశారు. నాటి పోరాటంలో కనీస పాత్రలేని మతోన్మాద కాషాయిశక్తులు నేడు చరిత్రను మత కోణంలో వక్రీకరించి రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్నారని తీవ్రంగా ధ్వజమెత్తారు. ప్రజల ఐఖ్యతతో సాగిన చారిత్రక విప్లవాన్ని తప్పుదోవ పట్టించే కుట్రలను ప్రతీ ఒక్కరూ తిప్పికొట్టాలని అమరుల అశాయలసాధనకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జి వీరస్వామి జిల్లా సమితి సభ్యులు నెరేళ్ల రమేష్ భూక్య శ్రీనివాస్ పట్టణ నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు భవాని తల్లాకుల భాస్కర్ మల్లేష్ రవికిరణ్ కాశి నాగరాజు సాంబిరెడ్డి కార్పొరేటర్ నాగలక్ష్మి మంగ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతిని పూజిస్తేనే పుణ్యం

**నేడు వినాయక చవితి**



**ప్రజాపక్షం/మధిరః** సామూహిక వినాయక నవరాత్రి ఉత్సవాలను బహిరంగ ప్రదేశబూల్లో, వీధుల్లో నిర్వహించడాన్ని లోకమాన్య చాలా గంగాధర్ తిలక్ ప్రారంభించారు. 1893వ సంవత్సరంలో మహారాష్ట్రంలో ఈ సామూహిక ఉత్సవాలకు నాంది పలికారు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ప్రజల్లో జాతీయ భావాన్ని, ఐకమత్యాన్ని పెంపొందించడానికి తిలక్ ఈ వేడుకలను సామాజిక పండుగగా మార్చారు. కుల, మత , వర్గ బేధాలు లేకుండా ప్రజలందరూ ఒకే తాటిపైకి వచ్చి సామూహికంగా విగ్రహబూలను ప్రతిష్ఠించి పూజలు చేసేలా ఈ బహిరంగ ఉత్సవాలకు రూపకల్పన చేశారు. మన తెలుగు రాష్ట్రాల్లో జరిగే పండుగల్లో వినాయక చవితికి చాలా ప్రాధాన్యత ఉంది. వినాయక చవితి రోజు ఊరు వాడ అనే బేదం లేకుండా అన్నిచోట్ల వినాయక ప్రతిమను ఉంచి దాదాపు 15 రోజులు పూజలు నిర్వహిస్తూ ఉంటారు. తర్వాత వినాయక ప్రిమలను నీటిలో నిమజ్జనం చేయడం జరుగుతుంది. దశాబ్దాల క్రితం వినాయక ప్రతిమలను మట్టితో తయారు చేయడం వలన ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. మట్టి విగ్రహబూలు నీటిలో సులభంగా కరిగిపోతాయి. కాబట్టి జల వనరులు కాలుష్యం కాకుండా ఉంటాయి. కాని ప్రస్తుతం వినాయక ప్రతిమలను ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో యారు చేసి దానికి రకరకాల రంగులు అద్దటం వన ఈ రసాయనిక పదార్థాలు పూజల అనంతరం ప్రతిమలను నీటిలో నిమజ్జనం చేసేటప్పుడు నీటిలో ఉన్నటువంటి జీవరాశులకు ఈ హానికరం రసాయనాల వలన చాలా ప్రమాదం వాటిల్లుతుంది. నీరు కూడా కలుషితం అవుతుంది. ఫాస్టర్ ఆఫ్ ఫారిస్ నీటిలో కరగడానికి చాలా కాలం పడుతుంది. ఇలాంటి రసాయనాలు నీటిలో విడుదలవడం ద్వారా ఆ నీరు త్రాగడానికి కూడా పనికిరాకుండా పోతుంది. మన పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉంది. మనందరం కలిసికట్లుగా ఉంటూ మట్టి వినాయక ప్రతిమలను మాత్రమే పూజించడం ద్వారా పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఒటుంది. మట్టితో తయారు చేసినటువంటి వినాయక ప్రతిమలను నీటిలో నిమజ్జనం చేసినప్పుడు ఎలాంటి ఇబ్బంఇ ఉండదు. జలచర రాశులను కూడా మనం రక్షించిన వారం అవుతాము. మట్టి వినాయక విగ్రహాలను నిమజజనం చేయడం ద్వారా నీటి కాలుష్యం అనేది జరగదు. బాధ్యతాయుతమైన పౌరులుగా మనం అందరం మట్టి విగ్రహాలను పూజిద్దాం.

# రజాకార్లకు ఎదురొడ్డిన పోరుగడ్డ తనికెళ్ల





-రజాకార్లను గడగడలాడించిన గడల సీతారామయ్య
-అశువులు బాసిన విప్లవ వీరులెందరో..
-తమ్ముడి ఆచూకీకోసం అన్న గడల ముత్తయ్యకు చిత్రహింసలు
-గడల సీతారామయ్య కోసం దళితుడి ప్రాణత్యాగం
-నేటికి మానని గాయాలు





**ప్రజాపక్షం/కొణిజర్ల :** తెలంగాణ సంస్థానాన్ని ఏలుతున్న నైజాంపాలనను వ్యతిరేకిస్తున్న రోజులవి. తెలంగాణ సాయుధపోరాటం కోసం గ్రామాల్లోని యువకులు తమ ప్రాణాలను కూడా బలిపెట్టి సమసమాజాన్ని స్థాపించాలని కలలుకన్నారు. అందులో భాగంగానే ఆనాడు కొణిజర్ల మండలం తనికెళ్ల గ్రామంలో గడల కృష్ణయ్య , సీతమ్మగార్ల సంతానం మొత్తం సాయుధపోరాటంలో ప్రత్యక్షంగా , పరోక్షంగా భాగమయ్యారు. వీరిలో చిన్న కుమారుడైన గడల సీతారామయ్య అజ్ఞాతంలోకి వెళ్లి సాయుధపోరాటాలు చేపట్టారు. మల్లెల వెంకటేశ్వరరావు దళంలో గడల సీతారామయ్యతోపాటు ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన తుళ్లూరు సీతారామయ్య, తులిశమ్మ దంపతులతోపాటు మరికొందరని కలుపుకొని అజ్ఞాతంలోకి వెళ్లారు. పగటిపూట అడవుల్లో తలదాచుకుంటు రాత్రి సమయాల్లో ప్రజలతో సమావేశమై ప్రజలను చైతన్యపరిచేవాడు. ఉమ్మడి కమ్యూనిస్టుగా ఉన్నప్పుడు మహమ్మద్ రజబ్‌ఆలీ , పుచ్చలపల్లి సుందరయ్య, యాసా వెంకటలాలయ్య, పేరసాని అప్పయ్య, దొండపాటి వెంకయ్య, పిన్నం సత్యం , గడల రామకృష్ణయ్య , గడల సుబ్బయ్యలతో సమాలోచనలు జరిపేవాడు. పార్టీ అభివృద్ధి , రైతుకూలీల సమస్యల పరిష్కారానికి కృషిచేశాడు.

### సీతారామయ్యను అంగ వస్త్రాలకింద దాచి రజాకార్లకు దొరకకుండా చేసిన గిరిజన మహిళ

ఒకసారి గడల సీతారామయ్య తనికెళ్ల శివారు బోడియాతండాలో ఉన్న సమాచారం అందుకున్న రజాకార్లు తండాను చుట్టిముట్టడించి తండాలోని ప్రతి ఇంటిని జల్లెడపట్టి వెతకడం ప్రారంభించారు. తండాలోని ఓ గిరిజన మహిళ తన అంగవస్రాలకింద సీతారామయ్యను దాచిపెట్టి ఆయనను దొరకకుండా చేసింది. దీనినిబట్టి ప్రజల్లో ఆయనకున్న ప్రేమ ఎంతో అర్థమవుతుంది.

### పార్టీ విస్తరణే లక్ష్యం

భారత కమ్యూనిస్టుపార్టీని జిల్లా వ్యాప్తంగా విస్తరింపచేయాలనే లక్ష్యంతో సీతారామయ్య పనిచేశారు. తాలూకా కార్యదర్శిగా ఉన్న సీతారామయ్య తనికెళ్లతోపాటు గణేశ్వరం , బురదరాఘువాపురం , పాపకొల్లు , జూలూరుపాడు , అశ్వాపురం , మణుగూరు , మల్లవరంతోపాటు జిల్లావ్యాప్తంగా ఎర్రజెండా ఎగురవేసి పార్టీస్థాపించి వారందరిని ఎర్రజెండా నీడకింద పనిచేసేలా చేశారు. గడలసీతారామయ్యను పట్టుకున్న రజాకార్లు ఆయన్ను వీధులగుండా ఈడ్చుకెళుతు గుర్రాలతో తొక్కించి కమ్యూనిస్టులకు సహకరించినవారికి ఇదేగతి పడుతుందని హెచ్చరించారు.



### కమ్యూనిస్టులకు అన్నంపెట్టిన యాసా మాణిక్యమ్మ

రజాకార్లు కమ్యూనిస్టులకోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టిన సమయంలో తనికెళ్ల శివారు బోడియాతండా పరిసర ప్రాంతాల్లో తలదాచుకుంటున్న సమయంలో గడల సీతారామయ్య తోబుట్టిన చెల్లెలు యాసా మాణ్యిమ్మ తట్టలో వండిన అన్నంతోపాటు బియ్యం , పచ్చళ్లు తీసుకొని అర్థరాత్రి సమయాల్లో పొలాల్లో నడుచుకుంటు వారున్న చోటికెళ్లి ఇచ్చేది. ఆవిధంగా మాణిక్యమ్మ కమ్యూనిస్టులకు సహాయపడింది.

### తమ్ముడి ఆచూకీకోసం అన్న గడల ముత్తయ్యను చిత్రహింసలు

తమ్ముడు సీతారామయ్య ఆచూకీకోసం అన్న గడల ముత్తయ్యను పట్టుకెళ్లి రెండుచెట్ల మధ్యలో కాళ్లు చేతులను తాళ్లతో కట్టి చెట్లకు వేలాడదీసి చిత్రహింసలకు గురిచేశారు. ఆచూకీ చెప్పక పోవడంతో తుపాకీ మడిమతో డొక్కలోపొడిచి అతికిరాతకంగా వ్యవహరించినా తమ్ముడిజాడ చెప్పని త్యాగం ముత్తయ్యది. గడల రామకృష్ణయ్య , గడల నర్సయ్య కుటుంబాలు సైతం కమ్యూనిస్టు పోరాటంలో పాలు పంచుకున్నాయి.

### గడల సీతారామయ్యకోసం దళితుడి ప్రాణత్యాగం

తెలంగాణ సాయుధపోరాటం ఉవ్వేత్తున ఎగుస్తున్నరోజులవి. ఆక్రమంలో గడల సీతారామయ్యతో పాటు యమరో 18 మందిని బోనకల్లు మండలం గోవిందాపురం క్యాంపునకు తరలించారు. వారందరిని వరుసగా నిలబెట్టి మీలో గడల సీతారామయ్య ఎవరో బయటకొస్తే అతని ఒక్కడినే కాల్చి మిగతావారందరిని వదలిపెడతామని హుకుంజారీచేశారు. మధిర మండలానికి చెందిన ఓ దళితుడు నేనే గడల సీతారామయ్యను అంటు బయటకొచ్చాడు. వెంటనే ఆదళితుడిని కాల్చి చంపారు. నిజంగా చనిపోయింది. గడల సీతారామయ్య? లేక వేరొక వ్యక్తా అని దానిని నివృత్తి చేసుకునేందుకు శవంమీద బట్టలు సీతారామయ్య ఇంటికి పంపించి కుటుంబసభ్యులను క్యాంపుకురావాలని ఆదేశించారు. చెల్లెలు యాసా మాణిక్యమ్మ గోవిందాపురం క్యాంపుకు వెళ్లింది. అక్కడ అన్న బతికుండటం చూసింది. తన అన్న బతికుండాలంటే చనిపోయిన దళితుడే అన్న అనేవిధంగా శవందగ్గర బోరున ఏడ్చింది. దీంతో నిజంగానే సీతారామయ్య చనిపోయాడని నిర్ధారణ చేసుకొని వెళ్లిపోయారు. ఆవిధంగా అన్ననుబతికించుకున్నవీరవనితయాసా మాణిక్యమ్మ

### పోలీస్ స్టేషన్ మెట్లెక్కని తనికెళ్ల ప్రజలు

195657 సంవత్సరంలో తనికెళ్ల చుట్టుప్రక్కల గ్రామాల శాంతిభద్రతల నిమిత్తం తనికెళ్లలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటుచేశారు. కాని 1985 వరకు సుమారు 20 సవంవత్సరములవరకు పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు నమోదు కాక పోవడంతో పోలీస్‌స్టేషన్ ఎత్తేశారు. తనికెళ్లను సోవియట్ , రష్యా బృందాలు సందర్శించి తనికెళ్లను మిని సోవియట్‌గా అభివర్ణించారు.

### పిన్నం సత్యం త్యాగం అజరామం

తనికెళ్ల సిపిఐ కార్యాలయం సమీపంలో పిన్నం సత్యం ఇల్లు ఉంది. ఆయన ఇంటి ఎదురుగా చింతచెట్టుకు సిపిఐ జెండా కట్టారు. రజాకార్లు పిన్నం సత్యంను చెట్టుపైనున్న జెండాను విప్పి కిందపడేయాలని ఆదేశించారు. దానికి ఆయన నిరాకరించడంతో వారు ఆగ్రహించి చేతివేళ్లలో సూదులుగుచ్చి కాల్చి చంపుతామని బెదిరించినా ఎదురొడ్డి నిలిచారు. ఆయన ధైర్యాన్ని చూసి వెనుదిరిగి పోయారు.

### గొర్రెలపాలు అందించిన పెద్ద బిక్షం

తనికెళ్ల గ్రామానికి చెందిన కమటాల పెద్ద భిక్షంకు గెర్రల మందలు ఎక్కువగా ఉండేవి. గొర్రెలపాలు సీతారామయ్య దళం నుంచి వచ్చిన వ్యక్తి అందించడంవలన ఆపాలుతాగి మద్యాహ్నంవరకు అన్నం తినకుండా ఉండేవారు.

### రాలిపోయిన ఎర్రమందారం

తనికెళ్ల గ్రామ కమ్యూనిస్టు నిర్మాత. అభివృద్ధిలో చిరస్మరణీయుడు గడల సీతారామయ్య కామెర్ల వ్యాధితో బాధపడుతు 1977 మార్చి 4 న వరంగల్ మహాత్మాగాంధి ఆసుపత్రిలో కన్నుమూశారు. ఆయనను ఎడ్లబండిపై కుర్చీలోకూర్చోబెట్టి గ్రామంలోని ప్రతిబజారుకు ఊరేగింపు నిర్వహించారు. ఇంటింటికి సీతారామయ్యకు హారతులిచ్చి కొబ్బరికాయలు కొట్టారు. అంతిమయాత్ర తిరునాళ్లను మరిపించే రీతిలో కొనసాగింది. సీతారామయ్య మరణవార్త విన్నదగ్గరనుంచి ఆయన అంతిమసంస్కారాలు అయ్యేంతవరకు గ్రామంలో ఒక్క పొయ్యివెలిగించలేదు. నేటికి ఆయన గొప్పతనం ప్రజలు చర్చించుకుంటున్నారు.

# సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం



**ప్రజాపక్షం/మణుగూరుః** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియూసి మణుగూరు బ్రాంచ్ జనరల్ బాడీ సమావేశం పివి కాలనీ కమ్యూనిటీ హాల్ లో జరిగింది. ఈ సమావేశానికి యూనియన్ అధ్యక్షులు కామ్రేడ్ వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కొరిమి రాజ్ కుమార్, అడిషనల్ జనరల్ సెక్రటరీ కామ్రేడ్ మిర్యాల రంగయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియూసి ఇచ్చిన సమ్మె నోటీసుతో రీజనల్ లేబర్ కమిషనర్ సమక్షంలో మేనేజ్‌మెంట్ తో 24 డిమాండ్స్ పై ఆగస్టు 27న చారిత్రాత్మక అగ్రిమెంట్ చేసుకోవడం జరిగిందని అన్నారు. ఒప్పందంలో ముఖ్యంగా కార్మికులు 13 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న ఫిరక్స్డ్ ఇన్కమ్ టాక్స్ యాజమాన్యం చెల్లించుటకు అంగీకరించిందని, న్యాచురల్ డెత్ కి 20 లక్షల రూపాయలు కార్మికుని కుటుంబానికి చెల్లించే విధంగా, ప్రతినెల మెడికల్ బోర్డు పెట్టే విధంగా సకాలంలో సేఫ్టీ మెటీరియల్ అందించే విధంగా డిస్మిస్ కార్మికుల సమస్య పరిష్కారం, మైనింగ్, టెక్నికల్ సిబ్బందికి మెడికల్ ఆన్ ఫిట్ అవుతే సర్ఫేస్లో సూటబుల్ జాబ్ ఇచ్చే విధంగా, 202526 గడిచిన ఆర్థిక సంవత్సరంలో లాభాల వాటా దసరా పండుగలోపు ఇవ్వడానికి, మెడికల్ అటెండెన్స్ రూల్స్ మార్చడానికి, సింగరేణి పాఠశాలలో సిబిఎస్ఈ సిలబస్ అమలుకు,కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ వైద్య సదుపాయం కల్పించడం కొరకు, జనరల్ స్ట్రైక్ లో కాంటాక్ట్ కార్మికులు సమ్మెలో పాల్గొంటే నో వర్క్ నో వేజెస్ కింద పెనాల్టీ విధించకుండా, కార్మికులకు సొంత ఇంటి పథకం అమలుకు ప్రభుత్వంతో చర్చించి అమలకు ప్రయత్నిస్తామని మొత్తం 24 డిమాండ్లపై ఒప్పందం కుదిరిందని వెల్లడించారు. 12వ వేజ్ బోర్డ్ ఏర్పాటు కొరకు జాతీయ సంఘాలు అన్నీ కలిపి చేసిన ఒత్తిడి మేరకు కోల్ ఇండియా యాజమాన్యం ప్రభుత్వానికి లేఖ రాస్తానని అంగీకరించిందని అన్నారు. వేజ్ బోర్డు సాధనకు ఏఐటియూసి సహ జాతీయ సంఘాలు ఇచ్చే పిలుపు మేరకు కార్మిక వర్గం అంతా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి కామ్రేడ్ వై రాంగోపాల్, వైస్ ప్రెసిడెంట్ కామ్రేడ్ ఎం.వి.రామనసయ్య, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మేకల ఈశ్వరరావు, జాయింట్ సెక్రటరీ పుల్లారావు ఆఫీస్ బేరర్స్ ఆవుల నాగరాజు, ఏ సురేందర్, బి సురేందర్ రావు, ఏ రాజశేఖర్, పిట్ సెక్రటరీలు జి శ్రీనివాసరావు, బి రవి, వి. సతీష్, ఆందోని రవికుమార్ సాయి ప్రకాష్ చారి, గుండు శరత్ కుమార్, ఎం పద్మావతి, రత్నం శివకుమార్, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ కౌన్సిల్ మెంబర్స్ మైన్స్, సేఫ్టీ కమిటీ మెంబర్స్, సానుభూతిపరులు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 15 ఏళ్లగా మట్టి విగ్రహాల పంపిణీ చేస్తున్న సొసైటీ

**-గణపతి విగ్రహాల పంపిణీ కో-చైర్మన్ గా ముస్లిం యువకుడు**
**-పర్యావరణం.. మతసామరస్యంకు ప్రతీకగా సేవలు**




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** భక్తి, బాధ్యత కలిస్తే పర్యావరణానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఈ సంకల్పంతో భక్తరామదాసు సర్వీస్ సోసైటీ మట్టి విగ్రహాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. గత 15 ఏళ్లగా ఈ సోసైటీ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల తయారు చేసి ఉత్సవాలకు ముందు భక్తులకు ఉచితంగా అందజేస్తున్నారు. ఎప్పటిలాగే ఈ సారి నేలకొండపల్లి మండల కేంద్రంలో మట్టి విగ్రహాల పంపిణీ చేస్తున్నారు. ఖమ్మం కు చెందిన కళాకారులతో ప్రత్యేకంగా మట్టి తో విగ్రహాల ను స్థానిక సత్యసాయిబాబా దేవాలయం లో తయారు చేశారు. ఆదివారం సాయంత్రం ప్రధాన సెంటర్ లో పంపిణీ కి ఏర్పాటు చేశారు. అంతే కాకుండా ఇటీవల కాలం లో పాఠశాలలు, కాలేజీలలో పర్యావరణం పై అవగాహన సదఘులు నిర్వహించారు. ఇది ఇలా ఉండగా సోసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమం కు విగ్రహాల పంపిణీ కమిటి కోచైర్మన్ గా షేక్ ఖాసిం సాహెబ్ అనే ముస్లిం యువకుడు ను నియమించారు. ఇటు పర్యావరణం, అటు మతసామరాస్యం కు ప్రతీకగా ఖాసింసాహెబ్ ద్వారా పంపిణీ కార్యక్రమం ను నిర్వహిస్తున్నారు. ముస్లిం యువకుడు ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మట్టివిగ్రహాలతో పర్యావరణం కు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటి చైర్మన్ వెల్లంపల్లి శ్రీనివాసరావు, కోచైర్మన్ షేక్ ఖాసింసాహెబ్, కొమ్మూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టుల పురోగమనం తప్పదు

**-జనరేషన్ జెడ్ చేస్తున్న డిమాండ్లు కమ్యూనిస్టులవే..**
**-ప్రజాపక్షంతో పువ్వాడ**
**-నేడు పువ్వాడ 89వ పుట్టిన రోజు**









**ప్రజాపక్షం/ ఖమ్మం :** దేశంలో కమ్యూనిస్టుల పురోగమనం తప్పదని కమ్యూనిజానికి ప్రత్యామ్నాయం లేదని సిపిఐ సీనియర్ నాయకులు, శాసనసభ, శాసన మండలి మాజీ సభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు తెలిపారు. పాలకులు ప్రజలను మరిచి పాలన సాగిస్తున్నారని తమ రాజకీయ అవసరాలు నెరవేర్చుకునేందుకు కొన్ని పథకాలను ప్రజలకు ఎరగా వేస్తున్నారని ఆయన ఆరోపించారు. కమ్యూనిస్టు ఉద్దండుడిగా సుదీర్ఘ కాలం ప్రజాప్రతినిధిగా, ఉమ్మడి ఖమ్మంజిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన పువ్వాడ నాగేశ్వరరావు సోమవారం 89వ వసంతంలోకి అడుగుపెడుతున్నారు. 88 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పువ్వాడ 70 సంవత్సరాల రాజకీయ జీవితాన్ని గడిపారు. ఉన్నత పాఠశాలలో చదువుతున్నప్పుడే సమస్యలపై ప్రశ్నించి ఆందోళనకారుడిగా ముద్రపడిన పువ్వాడ ఆ తర్వాత విద్యార్థి నాయకునిగా, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షునిగా పని చేశారు. 29 సంవత్సరాలకే భారత కమ్యూనిస్టు పార్టీ ఉమ్మడి ఖమ్మంజిల్లా కార్యదర్శిగా ఎన్నికైన పువ్వాడ అనేక రాజకీయ ఎత్తుపల్లాలను చూశారు. అధికార పార్టీ నేతలతో సానుకూలంగా ఉంటూ అభివృద్ధి పనులను మంజూరు చేయిస్తూనే మరో పక్క కమ్యూనిస్టు నేతగా అధికార పార్టీల ప్రజా వ్యతిరేక విధానాలపై ఎడతెగని పోరాటం చేసే వారు. పువ్వాడ ఓ సమస్యను తీసుకున్నారంటే అది పరిష్కారం కావాల్సిందేనన్న భావన అప్పట్లో ఉండేది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పువ్వాడ తిరగని ప్రాంతం చూడని ఊరు, తన గొంతు విప్పని సమస్య లేదంటే అతిశయోక్తి కాదు. 1/70 సమస్య అయినా, పోడు సమస్య అయినా, గోదావరి జలాలైనా మరేదైనా ఆయన పోరాటం ద్వారానే పరిష్కారం చూపాలనే భావనతో పనిచేసే వారు. ఈ వయస్సులోనూ నిరంతరం సమాజాన్ని అధ్యయనం చేస్తున్న పువ్వాడ విపక్ష, అధికార పక్ష కదలికలను గమనిస్తున్న పువ్వాడ అధ్యయనాన్ని మాత్రం వదులుకోలేదు. కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాలను సైతం గమనిస్తూ నిరంతరం సలహాలు ఇస్తున్న పువ్వాడ 88 సంవత్సరాలు పూర్తి చేసుకుని 89వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా ప్రజాపక్షం బ్యూరో ఏనుగు వెంకటేశ్వరరావుతో అనేక విషయాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. కమ్యూనిస్టులు ఎన్నికల విషయంలో వెనకబడి ఉండవచ్చు. ఎన్నికలను డబ్బు, అధికారం, యంత్రాలు శాసిస్తున్న రోజుల్లో కమ్యూనిస్టులకు ఆశించిన గెలుపు దక్కడం లేదు. అంత మాత్రాన కమ్యూనిస్టుల పని అయిపోలేదు. రెండు దశాబ్దాలుగా కేంద్రంలో, రాష్ట్రంలో పాలన చూసిన ప్రజలు కమ్యూనిస్టుల గురించి ఆలోచించడంతో పాటు ఎర్ర జెండాల అవసరాన్ని గుర్తిస్తున్నారు. ఇప్పటికీ ఇప్పుడు సాధ్యం కాకపోవచ్చు కానీ కమ్యూనిస్టుల పురోగమనం తథ్యమని పువ్వాడ స్పష్టం చేశారు. కమ్యూనిస్టులు బలహీనపడితే పేద, మధ్యతరగతి, కార్మికులు, రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు.

### ఈ తరం డిమాండ్లు కమ్యూనిస్టులవే...

ప్రస్తుతం జనరేషన్ జెడ్ పేరుతో దేశంలో ఓ తరం ఆందోళన చేపట్టి పలు డిమాండ్లు ప్రభుత్వం ముందు ఉంచడం అభినందనీయమన్నారు. జనరేషన్ జెడ్ పేరుతో ప్రభుత్వం ముందు ఉంచిన డిమాండ్లు అన్ని కమ్యూనిస్టు పార్టీల డిమాండ్లేనని, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, అవినీతి రహిత పాలన, అర్హులకు సంక్షేమం మొదలైనవి కమ్యూనిస్టుల డిమాండ్లేనని పువ్వాడ తెలిపారు. బలమైన ప్రజా పోరాటాలు ఉన్నప్పుడు ప్రజలకు అనుకూలమైన చట్టాలు రూపుదిద్దుకుంటాయని ఈ దేశంలో ప్రజా అనుకూల లేదా ప్రజా ప్రయోజన చట్టాలన్ని కమ్యూనిస్టు పార్టీ పోరాట ఫలితమేనన్నారు. రాజకీయ అవినీతి అత్యంత ప్రమాదకరమని ఇది అన్ని వ్యవస్థలను ఛిద్రం చేస్తుందన్నారు. రాజకీయ పార్టీలు ముఖ్యంగా అధికారంలో ఉన్న పార్టీలు స్వప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యతనివ్వాలన్నారు.

### మారిన పరిస్థితులకు అనుగుణంగా...

మారిన పరిస్థితులకు అనుగుణంగా మనము మారాలని ప్రతి మార్పును ప్రజలకు అనుకూలంగా మార్చగలిగినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కొంత కాలంగా అన్ని రంగాల్లోనూ విప్లవాత్మక మార్పులు వచ్చాయని ఇవే మార్పులు కొన్ని రంగాలను కనుమరుగు చేశాయని కార్పొరేట్లు, సంపన్నులు తప్ప సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడిందని ఇది అవాంఛనీయ పరిణామమన్నారు. సగటు మనిషి పురోభివృద్ధి లక్ష్యంగా మార్పు రావాలన్నారు. దేశ సంపద కొందరి చేతుల్లో కేంద్రీకృతం కావడం అత్యంత ప్రమాదకరమని ఇది దేశ అస్థిరతకు, అంతర్గత ఆందోళనలకు దారి తీస్తుందన్నారు. పాలకులే అక్రమ సంపాదనలకు ఆస్కారం ఇవ్వడం అత్యంత బాధాకరమని దీనిని కట్టడి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కమ్యూనిస్టులు సైతం మార్పులు అందిపుచ్చుకుని ప్రజా ఉద్యమాల తీరు మార్చుకున్నప్పుడు ఆశించిన ఫలితాలు దక్కుతాయన్నారు.

### కొరవడిన అంకిత భావం...

ఇప్పటి రాజకీయ నాయకుల్లో అంతకిభావం కొరవడిందని తన అవసరానుగుణంగా మసులు కోవడం ద్వారా ప్రజల విశ్వాసం పొందలేరని పువ్వాడ తెలిపారు. కార్యకర్తలను రక్షించుకోగలిగిన నాయకులు సుదీర్ఘ కాలం ప్రజా క్షేత్రంలో మనగలుగుతారని, ఏ ఎండకు ఆ గొడుగు పట్టే వారి గెలుపులు తాత్కాలికమేనని ఆయన అభిప్రాయ పడ్డారు. దేశంలో ఇప్పటికీ ఇప్పుడు మార్పు రాకపోవచ్చు కానీ మార్పు తథ్యమని ఆయన స్పష్టం చేశారు. యువత హక్కుల సాధన కోసం పోరు మార్గం ఎంచుకోవడం సరైనదే అన్నారు. మతం, కులం ఎన్నికల ఎజెండాలోకి రావడం దురదృష్టకర పరిణామమన్న పువ్వాడ ఆర్థిక అసమానతలు లేని, వివక్ష లేని సమాజ నిర్మాణాన్ని ఆకాంక్షిస్తున్నానన్నారు. విలువలతో జీవించడం, ప్రజల మధ్య గడపడం, సమయపాలన పాటించడం ప్రజాప్రతినిధులు అలవర్చుకోవాలని ఆయన సూచించారు.

---

# జర్నలిస్టుల హక్కుల కోసం ఒక్కటైన కలం

**-ఐక్యవేదికగా యూనియన్లు, ప్రెస్‌క్లబ్‌లు**
**-జర్నలిస్టుల ఐక్యత రాష్ట్రానికే ఆదర్శం**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** వార్తలు వేరు కావచ్చు.. సంస్థలు వేరు కావచ్చు.. కానీ జర్నలిస్టుల హక్కుల విషయంలో అందరం ఒక్కటే అనే నినాదంతో సత్తుపల్లి జర్నలిస్టులు ఐక్యతకు నూతన బాటలు వేశారు. వివిధ జర్నలిస్టు యూనియన్లు, ప్రెస్‌క్లబ్‌ల ప్రతినిధులు ఒకే వేదికపైకి చేరి ఉమ్మడి హక్కుల సాధనే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సదాశివునిపేటలో నిర్వహించిన జర్నలిస్టుల ఐక్యవేదిక సమావేశం స్నేహ పూర్వక, ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది. చాలాకాలం తర్వాత వివిధ సంఘాలకు చెందిన జర్నలిస్టులు ఒకే వేదికపై కలుసుకుని పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుంటూ, అభిప్రాయాలను పంచుకుంటూ ఉత్సాహంగా సమావేశంలో పాల్గొన్నారు. మొత్తం కార్యక్రమం ఒక జర్నలిస్టుల కుటుంబ ఆత్మీయ సమ్మేళనాన్ని తలపించింది. అందరం ఐక్యంగా ఉందాంసమావేశంలో సీనియర్ రిపోర్టర్ బీవీ రామారావు మాట్లాడుతూ "అందరం ఐక్యంగా ఉందాం జర్నలిస్టుల సమస్యలు, హక్కుల సాధన కోసం కలిసికట్టుగా ముందుకు సాగుదాం" అని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల మధ్య చిన్నచిన్న భేదాలు ఉన్నా వాటిని పక్కన పెట్టి, అందరికీ సంబంధించిన సమస్యలపై ఒకే గొంతుకగా నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. ఐక్యతతోనే జర్నలిస్టుల హక్కులను సాధించుకోవచ్చని పేర్కొన్నారు. హక్కుల సాధనకు ఐక్యతే బలంముఖ్య ప్రసంగీకులు సీనియర్ జర్నలిస్టు యం.డి. షైబుధిన్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం అన్ని యూనియన్లు, ప్రెస్‌క్లబ్‌లు ఒకే వేదికపైకి రావడం అభినందనీయమన్నారు.

### జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలే ప్రధాన లక్ష్యం...

జర్నలిస్టుల సంక్షేమంలో భాగంగా ఇళ్ల స్థలాల సాధనకు ప్రాధాన్యత ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రజల సమస్యలను నిత్యం అధికారుల దృష్టికి తీసుకెళ్తున్న జర్నలిస్టులు తమ సొంత ఇంటి కలను సాకారం చేసుకునేలా ప్రభుత్వంపై ఉమ్మడిగా ఒత్తిడి తీసుకురావాలని అభిప్రాయపడ్డారు. "ప్రజలకు గొంతుకగా నిలిచే జర్నలిస్టుకు సొంత ఇంటి చిరునామా ఉండాలి" అనే ఆకాంక్ష సమావేశంలో బలంగా వ్యక్తమైంది.

### సత్తుపల్లి నుంచి రాష్ట్రానికి ఆదర్శ సందేశం...

జర్నలిస్టు యూనియన్లు, ప్రెస్‌క్లబ్‌లు వేర్వేరుగా ఉన్నప్పటికీ హక్కుల సాధన విషయంలో అందరూ ఒక్కటిగా నిలవవచ్చని సత్తుపల్లి జర్నలిస్టులు చాటి చెప్పారు. సంస్థాగత విభేదాలను పక్కనపెట్టి, స్నేహభావంతో ఒకే వేదికపై కలసి పనిచేయడం రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల జర్నలిస్టులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు. కలం వేర్వేరు చేతుల్లో ఉండొచ్చు కానీ జర్నలిస్టుల హక్కుల కోసం ఆ కలం రాసే అక్షరం ఒక్కటే కావాలి అనే స్ఫూర్తితో ముందుకు సాగాలని సమావేశం పిలుపునిచ్చింది. జర్నలిస్టుల సమస్యలు ఎవరివో కాదు అందరివని, హక్కులు కూడా ప్రతి జర్నలిస్టుకు సమానంగా అందాలని, అందుకోసం ఐక్యంగా అడుగు సమష్టిగా పోరాటం ఉమ్మడిగా సాధన అనే నినాదంతో ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించారు. సత్తుపల్లి జర్నలిస్టుల మధ్య కనిపించిన ఈ ఐక్యత, ఆత్మీయత, స్నేహభావం రాష్ట్ర జర్నలిస్టు సమాజానికే ఒక ఆదర్శంగా నిలవాలని పలువురు ఆకాంక్షించారు.

## ఆదరణ సేవా ఫౌండేషన్‌కు దుస్తులు, సామగ్రి అందజేత



**ప్రజాపక్షం/మధిర:** మానవత్వం పరిమలించే మంచి మనుసుకు స్వాగతం అన్న సినీ కవి మాటలు అంటున్నారు ప్రముఖ సంఘ సేవకులు లంకా కొండయ్య, ప్రముఖ సంఘ సేవకురాలు మైలా నిస్సీ ఆదివారం ఉదయం స్థానిక ఆజాద్ రోడ్డులో లంకా సేవా ఫౌండేషన్ నిర్వాహకులు లంకా కొండయ్య బృందం ధాతలు ఇచ్చినటువంటి బట్టలను, ఇంటి సామాగ్రిని ఆదరణ సేవా ఫౌండేషన్‌లో ఉన్నటువంటి వృద్ధులకు అందించడం జరిగింది. ఈ సందర్భంగా లంకా కొండయ్య మాట్లాడుతూ మధిరలో ఉన్నటువంటి చాలా మంది ప్రముఖులు ఇచ్చేటువంటి బట్టలు కాని సామాగ్రి గాని చాలామంది నిరుపేదలకు ఉపయోగపడుతున్నాయని తెలిపారు.

## ముస్తాబైన వినాయక మండపాలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు లలో వినాయక చవితి నవరాత్రులు సందర్భంగా ఆయా గ్రామాలలో ఊరూరా 10, మరియు 15 , 20 మండపాలలో వినాయక పూజలు నిర్వహించేందుకు వినాయక ఉత్సవ కమిటీలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడానికి మండపాలను సిద్ధం చేసుకున్నారు. మండల పరిధిలోని కల్లూరు మున్సిపాలిటీ తో పాటు ఆయా గ్రామాలలో పలు రకాల రంగురంగులతో తోరణాలు, రంగురంగు కాగితాలు, విద్యుత్ దీపాల తో మండపాలను సిద్ధం చేసుకుని ఆయా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా తొమ్మిది రోజులపాటు ఏర్పాటుకు ప్రత్యేక పూజలు అన్నదానాల కు అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్లు ఉత్సవ కమిటీలు వారు తెలుపుతున్నారు. ఈ మండపాలను మండల అధికార కమిటీ లతోపాటు ఎస్సై విద్యుత్ శాఖ తహశీల్దార్ ఎంపీడీవోలు ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తున్నారు.

# పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత



**- మట్టివిగ్రహాలతోనే ప్రకృతికి మేలు**
**- ఆర్యవైశ్య మహాసభ కృషి అభినందనీయం**
**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా**

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి సామాజిక బాధ్యతని, ప్రకృతిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని లక్ష్మీ దేవిపల్లి , లోతువాగు గ్రామ పంచాయితీలలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ, ఆర్యవైశ్య యువజన మహిళా విభాగాల ఆధ్వర్యంలో ఆదివారం మట్టివిగ్రహాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యాతిధిగాహాజరై ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం పాషా మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ రసాయనరంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమైన జీవకోటికి ముప్పు వాటిల్లే ప్రమాదముందన్నారు. పూర్వం నుండి వస్తున్నసాంప్రదాయాను సారం మట్టి విగ్రహాలను పూజించి నిమజ్జనం చేయడం ద్వారా పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందన్నారు. సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ ప్రకృతికి హానీ కలగకుండా మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు ముందుకొచ్చి ఆర్యవైశ్య మహాసభ పలు విభాగాల ప్రతినిధులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. భావితరాల వారికి స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రజలంతా కాలుష్య రహిత పండుగలను జరుపుకోవాలని పాషా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దారా ధీరజ్ పాషా బిల్లా శ్రీధర్ శ్రీకాంత్ ఆదర్ల శ్రీకాంత్ బోయిన శివ బోయిన ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# సాయుధ పోరాట అమరులను స్మరించుకుందాం

**- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి**



**ప్రజాపక్షం/చర్ల :** 78వ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవల సందర్భంగా అమరులను స్మరించుకుంటూ వారికి ఘనమైన నివాళి అర్పిద్దామని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వర రావు అన్నారు. శనివారం చర్ల మండల కేంద్రంలోని జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు తొత్తులుగా వ్యవహరించిన పటేల్ పట్వారీ జమీందార్ జాగీర్దార్లను కమ్యూనిస్టు గెరిల్లాలు తరిమికొట్టి ఆ స్ఫూర్తిని నేటి తరానికి అందించారన్నారు. 1948 సెప్టెంబర్ 17న సాయుధ పోరాట ఫలితంగా హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైందన్నారు. భూమి భుక్తి వెట్టిచాకిరీ విముక్తి కోసం జరిగిన తెలంగాణ పోరాటాన్ని హిందూ ముస్లీం ఘర్షణలుగా చూపే మతోన్మాదుల కుట్రలను తిప్పికొట్టాలన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చీకటి ఒప్పందం ఫలితంగానే నిజాం రాజుకు గవర్నర్ పదవి కట్టబెట్టారని చెప్పారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఫలితంగానే నిజాం నిరంకుశ పాలన రద్దయింది తప్ప పటేల్ సైనిక చర్య వల్ల కాదని స్పష్టం చేశారు. ఆ పోరాటంలో 4500 మంది యువ కిశోరాలు ప్రాణత్యాగం చేశారన్నారు. పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిపెట్టన చరిత్ర సిపిఐదిఅని అన్నారు. అమరుల ఆశయాల సాధన కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని అప్పుడే వారికి నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని తెలిపారు. తెలంగాణ రైతాంగా సాయుధ పోరాట వారోత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ మండలకార్యదర్శి నూపా పోతయ్య సహాయ కార్యదర్శి కోటి ముత్యాలరావు చల్లా లక్ష్మీ నారాయణ మండల కార్యవర్గ సభ్యులు కోటిరెక్కల రాజారావు నూప తిరుపతి పాలంచ రామారావు పాలెం సత్యనారాయణ అప్పలూరి నాగరాజు మల్లం నాగేశ్వర రావు కుర్నపల్లి సర్పంచ్ శ్యామల తిరుపతిరావు నూపా రాము నూపా మురళీ మునిగెల సాయి తోట శ్రీను సోడి సీతారాములు మడకం సుక్కయ్య రవ్వ పాండు చెన్నం సాంబశివరావు లక్ష్మీ అనసూయ నర్సింహారావు వీరన్న రమణ రామయ్య దేవయ్య కన్నయ్య శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి విగ్రహాలతో పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

**- మేయర్ మూడ్ గణేష్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మట్టి విగ్రహాలను ప్రతిష్టించి పూజించడం ద్వారానే పర్యావరణాన్ని కాపాడుకోవడం సాధ్యమవుతుందని ప్రతొక్కరూ బాధ్యతగా మట్టి విగ్రహాలను పూజించాలని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన కూడళ్లలో మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ రసాయనాలు పిఓపి తో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు తీవ్రంగా కలుషితమై జలచరాలు ప్రాణాలు కోల్పోతాయని చెప్పారు. ప్రకృతికి ఎలాంటి హాని కలుగకుండా సాంప్రదాయ బద్ధంగా పండుగలను జరుపుకోవాలని స్పష్టం చేశారు. ఈ మట్టి విగ్రహాల పంపిణీకి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించడం శుభ పరిణామమన్నారు. రాబోయే తరాలలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందిచేందుకు పర్యావరణ హితమైన పద్ధతులు పాటించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మునిగడప పద్మ కూరపాటి సుధాకర్ బండి నర్సింహా బోయిన విజయ్ కుమార్ శాంతిప్రియ సహేరాఅహ్మద్ ధనలక్ష్మి నాగలక్ష్మీ హరిత దుర్గయ్య హిమశ్రీ దాసరి శ్రీనివాస్ కళావతి స్థానికులు సత్యనారాయాణ చారి మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# మంచినీటి కోసం ఖాళీ బిందెలతో ధర్నా



**-నెల రోజులుగా నీటి కష్టాలు**
**-గంటపాటు రహదారి దిగ్బంధం**

**ప్రజాపక్షం/ములకలపల్లి:** చౌటుగూడెం పంచాయితీ కంపగూడెంలో నెల రోజులుగా మంచినీటి సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామస్తులు ఆదివారం ఖాళీ బిందెలతో కంపగూడెం క్రాస్‌రోడ్డుపై గంటపాటు ధర్నా చేపట్టారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి నరాటి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనతో రాకపోకలు నిలిచిపోయాయి. పంచాయితీ అధికారులు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు. సీపీఐ నేత నరాటి రమేష్ మాట్లాడుతూ గ్రామాల్లో మంచినీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నా, స్థానికంగా నాసిరకం మోటర్లు, స్టార్టర్లు ఏర్పాటు చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ మధుప్రసాద్ అక్కడికి చేరుకుని ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలతో ఫోన్‌లో మాట్లాడారు. ఆదివారం సాయంత్రం 5గంటల్లోపు సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ధర్నా విరమించారు. ఈకార్యక్రమంలో వెల్కమ్ కన్నయ్య, బక్కులు, ఓకే ఆదిలక్ష్మి, పూనం సుజాత, సబిత, రామకృష్ణ, సున్నం ఈశ్వరి, మహేశ్వరి, మమత, సుజాత, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

## శంకరాచారికి నివాళి

**-వీడియో కాల్‌లో పరామర్శించిన రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** టేకులపల్లి మండల ఉప సర్పంచ్ వసంతలక్ష్మి భర్త శంకరాచారి మృతికి ఉప సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహంకాళి రామారావు సంతాపం తెలిపారు. కుటుంబాన్ని పరామర్శించి, శంకరాచారి చిత్రపటానికి నివాళుల ర్పించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్‌తో వీడియోకాల్‌లో మాట్లాడించి కుటుంబానికి సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని వారు భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో బూర్గంపాడు మండల ఫోరం అధ్యక్షుడు బి మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు తోట మల్ల వెంకటరమణ, ఉప సర్పంచ్‌లు రాధాకృష్ణ మోతె, బేబీ, జయశ్రీ, గుండాల ఉప సర్పంచ్ తాటి రమేష్, బీసీ సంఘం జిల్లా కార్యదర్శి బెజ్జంకి కనకాచారి, విద్యార్థి నాయకుడు గోపి తదితరులు పాల్గొన్నారు.

## ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/గుండాల:** ఖమ్మం కేంద్రంగా సెప్టెంబర్ 28,29,30తేదీల్లో నిర్వహించనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్)జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ గుండాల మండలంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు తుపాకుల నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన భూ చట్టాలను వ్యతిరేకిస్తూ రైతాంగం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. 28న జరిగే భారీ బహిరంగ సభకు రైతులు, కూలీలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో గుండాల సర్పంచ్ కోరం సీతారాములు, కాచనపల్లి సర్పంచ్ కిషన్, గడ్డం లాలయ్య, యాసరపు వెంకన్న, పెంటన్న, పాయం ఎల్లన్న, లాలు, ఈసం కృష్ణ, ఆరం నరేష్, నరసన్న,మంగన్న, సమ్మన్న, ఉపేందర్, పాల్గొన్నారు.

## 16 గ్రామాలకు భారీ వినాయక విగ్రహాల వితరణ

**-తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మానాల కుటుంబం సేవ**



**ప్రజాపక్షం/గుండాల:** వినాయక చవితిని పురస్కరించుకుని గుండాల ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు మానాల వెంకటేశ్వర్లు, ఆయన కుమారుడు మానాల ప్రణీత్ కుమార్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు మానాల భద్రయ్య, శాంతమ్మ జ్ఞాపకార్థం 16 గ్రామాలకు 16 భారీ వినాయక విగ్రహాలను వితరణ చేశారు. గుండాల కొత్తగుంపు, సుభాష్‌నగర్, గుండాల తండా, పోతిరెడ్డిగూడెం, గురకలమడుగు, లింగూడెం, ముత్తాపురం, శమ్మనిగూడెం, కన్నాయిగూడెం, రోళ్ల గడ్డ, నరసాపురం తండా, మోదుగులగూడెం, వెన్నలబయలు, కస్తూరిబా పాఠశాల, చింతల పాడు, తూరుబాక ఎస్సీ కాలనీ గ్రామాల ప్రజలకు విగ్రహాలను అందజేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఐ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో ఇలాంటి సేవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. సేవలను మరిన్ని గ్రామాలకు విస్తరించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో మానాల నారాయణమూర్తి, మానాల ప్రభాకర్, మానాల ప్రణీత్‌కుమార్, మానాల శ్రావణ్‌కుమార్, తాటిపెల్లి నరసింహారావు, బట్టు మంగయ్య, వాసవి క్లబ్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీవిద్య-కృష్ణవేణి విద్యా సంస్థల ఫ్రెషర్స్ డే



**ప్రజాపక్షం/మణుగూరుః** మణుగూరు స్నేహ గార్డెన్స్ నందు ఆదివారం శ్రీవిద్య కృష్ణవేణి విద్యా సంస్థల ఫ్రెషర్స్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి కరస్పాండెంట్ పుచ్చకాయల శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో మంచి మార్కులు సాధించి, సమాజంలో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా జీవించాలని, యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా, భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల ఆశయాలను తీర్చాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులందరూ కళాశాలలో మంచి క్రమశిక్షణతో విద్యను అందిస్తున్నందుకు కళాశాల యాజమాన్యానికి తమ అభిప్రాయాలను ప్రసంగం ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శ్రీవిద్య కృష్ణవేణి విద్యా సంస్థల కరస్పాండెంట్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, పుచ్చకాయల శంకర్, అకాడమిక్ డైరెక్టర్ సారంగ పాణి , ప్రిన్సిపాల్ పి. నాగేశ్వరరావు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## రైతాంగ సమస్యల పరిష్కారానికి 28న ఛలో ఖమ్మం

**ప్రజాపక్షం/కారేపల్లి:** రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 28న నిర్వహించే ఛలో ఖమ్మం భారీ ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి వై ప్రకాష్ పిలుపునిచ్చారు. ఈసందర్భంగా కారేపల్లి మండలం పేరుపల్లి, జమాల్లపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించి గోడ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వై ప్రకాష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలతో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడిందని ఆరోపించారు. రైతులు, ఆదివాసీల హక్కులకు రక్షణ కల్పించే చట్టాలను బలహీనపరిచే చర్యలను వ్యతిరేకిస్తూ పోరాటాలు కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. రైతు ఉద్యమాల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 28,29,30 తేదీల్లో ఖమ్మంలో జరిగే ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభల్లో రైతాంగ సమస్యలు, భవిష్యత్ పోరాట కార్యాచరణపై చర్చించి ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. 28న జరిగే బహిరంగ సభకు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి, అలెం గురవయ్య, వెంకన్న, చంద్రయ్య, బాటయ్య, రాంబాబు, పెద్ద చంద్రయ్య, లక్ష్మక్క, జోగమ్మ, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# త్యాగధనుల పోరాటం చిరస్మరణీయం



### సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** నైజం నవాబ్ నిరంకుశ పాలనకు ఎదురొడ్డి, ప్రాణాలను సైతం త్యాగం చేసిన తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగాలు చిరస్మరణీయమని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంత్‌రావు అన్నారు. ఆదివారం ఖమ్మంరూరల్ మండలంపలోని ఎం,వెంకటాయపాలెం గ్రామంలో సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోరాట యోధుడు గంగవరపు శ్రీనివాసరావు విగ్రహానికి సిపిఐ జిల్లా పార్టీ, ఖమ్మంరూరల్ కమిటీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే గంగవరపు విజయ్‌కుమార్‌కు కూడా పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు ప్రజలను చైతన్యపరిచి, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం అలుపెరగని పోరాటాలు సాగించారని గుర్తు చేశారు. నాటి ఉద్యమంలో ఎందరో త్యాగధనులు తమ ప్రాణాలను అర్పించారని, వారి త్యాగాల ఫలితంగానే ప్రజల్లో హక్కులపై చైతన్యం పెరిగిందని అన్నారు. ఇందుకు గాను ప్రజలను ఏకం చేసి ఉద్యమాన్ని ముందుకు నడిపిన యోధులు గొప్ప సంఘ సంస్కర్తలుగా కమ్యూనిస్టులు చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. నాటి నుంచి నేటి వరకు ప్రజా సమస్యలపై కమ్యూనిస్టులు నిరంతరం పోరాటాలు చేస్తూ అనేక హక్కులను సాధించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. త్యాగధనుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని, అదే పోరాట పటిమతో నేటి ప్రజా సమస్యలపై కమ్యూనిస్టులు మరింత ఉధృతంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా సహాయకార్యదర్శి జుమ్మల జితేందర్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమీషనర్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్ధినేని కర్ణకుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎర్రబాబు, మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఉన్నం రంగారావు, పాసంగుల చందర్రావు, పగిళ్ల వీరభద్రం, ఎడ్లపల్లి శంకరయ్య, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మండల సమితి సభ్యులు ఏలూరి భాస్కర్, మెట్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

**- పోలీసులకు పూర్తి సహకారం అందించాలి**
**- వైరా ఏసిపి సారంగపాణి**



**ప్రజాపక్షం/వైరా:** గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, ఆనందంగా నిర్వహించుకునేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వైరా ఏసిపి సాదుల సారంగపాణి సూచించారు. ఈ సందర్భంగా ఏసిపి సారంగపాణి మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను ఆదర్శంగా నిర్వహించాలని కోరారు. ఈ నెల14న గణేష్ చతుర్థి, 25న నిమజ్జనం నేపద్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మండపాలు, విగ్రహాలు, నిర్వాహకులు, శోభయాత్ర మార్గం, నిమజ్జన వాహనాల వివరాలను నమోదు చేసి జియోట్యాగింగ్ చేయనున్నట్లు వెల్లడించారు. మండపాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు 24 గంటలు కనీసం ఇద్దరు వ్యక్తులు అందుబాటులో ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల రాకపోకలకు, ట్రాఫిక్‌కు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. మండపాల వద్ద లక్కీ డ్రాలు, జూదం నిర్వహించరాదని, మద్యం సేవించి ఎవరూ మండపాల వద్దకు రాకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్‌శాఖ అనుమతితలోనే విద్యుత్ కనెక్షన్‌లు ఏర్పాటు చేసుకోవాలని, నాణ్యమైన వైర్లు, విద్యుత్ పరికరాలను మాత్రమే వినియోగించాలని తెలిపారు. అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ ఎక్సింగ్విషర్లు, నీటి బకెట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. డిజేలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలిగించరాదని, ఇతర మతాలను కించపరిచేలా ప్రసంగాలు, పాటలు, ప్రచారాలకు దూరంగా ఉండాలని ఏసిపి స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్ల, అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని, అనుమానస్పద సమాచారాన్ని పోలీసుల ద్వారా నిర్ధారించుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు సమాచారం అందించాలని తెలిపారు. నిమజ్జన శోభయాత్రను పోలీస్‌శాఖ రూపొందించిన రూట్ మ్యాప్ ప్రకారమే నిర్వహించాలని, శాంతి కమిటీలు, ఉత్సవ కమిటీలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని వైరా ఏసిపి సాదుల సారంగపాణి కోరారు.

## కొలువుదీరనున్న గణపయ్య

**-సిద్ధమైన వినాయక పందిళ్లు**
**-నేడు వినాయక చవితి**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** వినాయక చవితిని పురస్కరించుకుని వినాయక విగ్రహాలు సోమవారం కొలువు దీరనున్నాయి. ఇందుకు సర్వం సిద్ధమైంది. భారీ విగ్రహాలను ఆవిష్కరించేందుకు వినాయక ఉత్సవ కమిటీలు సిద్ధమయ్యాయి. ఏ వైపు చూసినా కొనుగోలు కేంద్రాల నుండి తరలుతున్న వినాయక విగ్రహాలే కనిపిస్తున్నాయి. వినాయక విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి భారీ సెట్టింగ్‌లతో పందిళ్లను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది కూడా వినాయక నవరాత్రులు అంగరంగ వైభవంగానే జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. 1893లో పూణేలో ప్రారంభమైన సామూహిక గణేష్ ఉత్సవాలు ఇప్పుడు పల్లె పల్లెను తాకాయి. గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేయని పల్లె లేదంటే అతిశయోక్తి కాదు. మొత్తంగా వినాయక విగ్రహాల ఏర్పాటు కోసం ఉత్సవ కమిటీలు భారీగానే ఖర్చు చేస్తున్నాయి. నవరాత్రోత్సవాలు ఎలా జరిగినా ఈ ఏడాది నిమజ్జనం ఓ సమస్యగా మారింది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా చెరువులు, కుంటల్లో నీరు లేకపోవడంతో నిమజ్జనం ఎలా అన్న ప్రశ్న ఉత్సవ కమిటీల్లో తలెత్తుతుంది.

## నేటి నుంచి కొలువుదీరనున్న గణపయ్య

**-పూజా సామగ్రి, పూలు విక్రయించేందుకు పెద్ద ఎత్తున స్టాల్స్ ఏర్పాటు**



**ప్రజాపక్షం/వైరా:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని వైరా పట్టణంలో భక్తులు భక్తిశ్రద్ధలతో గణనాథుడిని మండపాల్లో ప్రతిష్టిస్తున్నారు. ఈ క్రమంలో నేటి నుంచి కొలువుదీరినట్లుగా ప్రత్యేకంగా రూపొందించిన వినాయక విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ప్రత్యేక అలంకరణలతో మండపంలో గణనాథుడిని ప్రతిష్టించి నిర్వాహకులు పూజా కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. వినాయకుడి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. ఇదిలా ఉండగా, వినాయక మండపాల వద్ద భక్తులకు అవసరమైన పూలు, పూజా సామాగ్రి తదితర వస్తువుల విక్రయానికి పెద్ద ఎత్తున స్టాల్స్ ఏర్పాటు చేశారు. దీంతో మండపాల పరిసర ప్రాంతాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. వినాయక చవితి సందర్భంగా భక్తులు పూజా సామాగ్రిని కొనుగోలు చేస్తూ ఉత్సవాల్లో పాల్గొంటున్నారు.

## మున్నేరుకు జలకళ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** గడిచిన రెండు రోజులుగా మున్నేరు నది ఎగువ ప్రాంతాల్లో వర్షాలు పడుతుండడంతో మున్నేరుకు కొత్త నీరు వచ్చింది. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభం నుండి ఇంతవరకు మున్నేరులో నీటి కదలికలు లేవు. రెండు రోజుల క్రితం వరకు ఎడారిలా ఉన్న మున్నేరుకు ఒక్కసారిగా జలకళ సంతరించుకుంది. వర్షాల ధాటి ఏ మేరకు ఉంటుంది అన్నది చెప్పలేని పరిస్థితి. కానీ కాల్వొడ్డు, పాత మున్నేరు వద్ద చెప్టా పై నుంచి రాకపోకలను నిలిపివేశారు.

## ఘనంగా శరత్ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** మాజీ కార్పొరేటర్ రాపర్తి శరత్ జన్మదిన వేడుకలను ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. పలువురు హాజరై ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలతో నిత్య సంబంధాలు కలిగి నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే రాపర్తి శరత్ రాజకీయంగా మరింత ఎదగాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, మున్నూరు కాపు సంఘం నాయకులు శెట్టి రంగారావు, దేవయ్య, జనార్ధన్, శీలంశెట్టి వీరభద్రం, పసుపులేటి దేవేందర్, తోట రామారావు, మాటేటి రవి పాల్గొన్నారు.

## చెత్తలో పడ్డ ఆర్అండ్‌బి సూచిక బోర్డు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం పెద్ద కోరుకొండిలో రోడ్లు భవనాలు శాఖ సూచిక బోర్డు చెత్తలో పడిపోయింది. దీనిని తీసేవారు, సరి చేసేవారు, సవరించేవారు లేనందున అది గత కొద్ది రోజులుగా చెత్తలోని ఉండటం వలన తుప్పుబట్టి పాడవుతుంది. ప్రయాణికులు మూలమలుపు వద్ద ఉన్న సూచిక బోర్డు లేకపోవడం వల్ల వాహనదారులు తికమక పడుతున్నారు. మండలంలోని పెద్ద కోరుకొండిలో పెట్రోల్ బంక్ సమీపం మరియు విద్యుత్ సబ్‌స్టేషన్ ల వద్ద ఈ విధంగా పడిపోయి ఉన్నందున ఆ సూచక బోర్డును సరిచేయాలని వాహనదారులు, ప్రయాణికులు ఆర్ అండ్ బి శాఖ అధికారిని కోరుతున్నారు. విషయమై ఆర్ అండ్ బి శాఖ అధికారిని వివరణ కోరగా సవరిస్తామని పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను తనిఖీ చేసిన ఎంపిడివో



**ప్రజాపక్షం/ తల్లాడ :** పైలెట్ ప్రాజెక్టు క్రింద కొడవటి మెట్ట గ్రామ పంచాయతీలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను పూర్తి స్థాయిలో తనిఖీ చేసినట్లు ఎంపిడివో శ్రీధర్ రాజు తెలిపారు. జిల్లా కలెక్టర్, ఇందిరమ్మ ఇండ్ల పిడి ఆదేశాల మేరకు గ్రామంలో నిర్మాణలో ఉన్న ఇండ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్మాణ, పురోగతి, లబ్దిదారుల వివరాలు , ఇండ్ల నిర్మాణ పరిస్థితిని పరిశీలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడివో శ్రీధర్‌రాజు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన లబ్దిదారులకు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం ఇండ్ల నిర్మాణం జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన తనిఖీ ద్వారా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు నమోదు చేసి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. లబ్దిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనులు వేగంగా పూర్తయ్యేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పెడిపల్లి రవి, సర్పంచ్ మోదుగు తిరుమలరావు, ఉప సర్పంచ్ జగన్‌మోహన్‌రావు, పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/వైరా:** రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి ఆదివారం మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వైరా ఎస్సై పుష్పాల రామారవు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల9వ తేదీన రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద రోడ్డ దాటుతుండగా వైరాకు చెందిన పువ్వాళ్ళ వెంకటయ్య అలియాస్ గుడ్డి వెంకటయ్య(52)ను గ్రీన్‌ఫీల్డ్ నుండి వైరా వస్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుని ఖమ్మం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైరా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జనసేన తెలంగాణ శంఖారావ సభకు భారీగా తరలింపు



**ప్రజాపక్షం/ముదిగొండ:** నగరంలో ఆదివారం నిర్వహించిన జనసేన తెలంగాణ శంఖారావం సభకు ముదిగొండ మండలం నుంచి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో భారీగా తరలి వెళ్లారు. తెలంగాణలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతుగా శంఖారావ సభకు తరలివెళ్లినట్లు నాయకులు తెలిపారు. సభను విజయవంతం చేసేందుకు ముదిగొండ మండలం నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేశ్, ఓరుగంటి ఈశ్వర్, మహమ్మద్ ఫరీధ్, దుర్గారావు గౌడ్, వేగినాటి రామకృష్ణ, చరణ్ తదితరులు ఆధ్వర్యంలో సభకు భారీ సంఖ్యలో సభకు హాజరయ్యారు.